బర్లీ సాగుపై రైతుల ఆసక్తి

జిల్లాలో కొత్తగా సాగు ప్రారంభం

ఈ ఏడాది 1300 హెక్టార్లలో సాగు

కలిగిరి: జిల్లాలోని మెట్టప్రాంత రైతులు ఈ ఏడాది కొత్తగా బర్లీ పొగాకు సాగును ప్రారంభించారు. ఏటా రబీ సీజన్‌లో పచ్చిశనగ, మినుము, కంది, తదితర సంప్రదాయ పంటలను సాగు చేసేవారు. మెట్ట పంటలకు ఖర్చులు పెరగడం..తెగుళ్లతో ఆశించిన స్థాయిలో దిగుబడులు రాక నష్టాలు వస్తుండడంతో రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి పెడుతున్నారు. ఈ నేపథ్యంలో ఐటీసీ కంపెనీ 'బర్లీ' పొగాకుపై అవగాహన కల్పించి రైతులను ప్రోత్సహించడంతో సాగు చేపట్టారు. జిల్లాలోని కలిగిరి పొగాకు వేలం కేంద్రం పరిధిలో సుమారు 550 ఎకరాలు, డీసీపల్లి పొగాకు వేలం కేంద్రం పరిధిలో సుమారు 750 ఎకరాల్లో బర్లీ పొగాకు సాగు చేపట్టారు. ప్రస్తుతం పంట ఆశాజనకంగా ఉంది. ఇప్పటికే పలువురు రైతులు రెండు విడతల్లో కోతలు పూర్తి చేశారు.

అంతర్జాతీయంగా డిమాండ్ ఉండడంతో..

అంతర్జాతీయంగా పొగాకుకు ఏర్పడిన డిమాండ్ నేపథ్యంలో వర్జీనియా రకంతో పాటు బర్లీ రకం పొగాకు సాగునూ వ్యాపారులు ప్రోత్సహిస్తున్నారు. అయితే వర్జీనియా సాగుపై పొగాకు బోర్డు నియంత్రణ, రైతులకు బ్యారెన్ రిజిస్ట్రేషన్, పంట పరిమితి తదితర నిబంధనలు ఉన్నాయి. దీంతో బ్యారెన్లు లేని రైతుల ద్వారా 'బర్లీ' సాగు చేయించడమే లక్ష్యంగా ప్రధాన వ్యాపార సంస్థలు ప్రయత్నాలు ప్రారంభించాయి. ఇప్పటికే పొగాకు కొనుగోళ్లలో ప్రధాన వ్యాపార సంస్థల్లో ఒకటైన జీపీఐ గత కొన్నేళ్లుగా 'బర్లీ' సాగును ప్రోత్సహిస్తూ క్రమ క్రమంగా వర్జీనియా పొగాకు కొనుగోళ్లను తగ్గిస్తోంది. ఈ ఏడాది పొగాకు వ్యాపారంలో పెద్దన్న పాత్ర పోషిస్తున్న ఐటీసీ సంస్థ కూడా బర్లీ పొగాకు సాగును ప్రోత్సహించే దిశగా అడుగులు వేస్తోంది. అంతర్జాతీయంగా పొగాకుకు మంచి డిమాండ్ ఏర్పడడంతో వర్జీనియాతో పాటు బర్లీ పొగాకుకు కూడా ఎగుమతి అవకాశాలు పుష్కలంగా ఉండటమే ఈ మార్పునకు కారణంగా అంచనా వేస్తున్నారు.


బర్లీ పొగాకు తోట

అధిక దిగుబడి, ఖర్చు తక్కువ

బర్లీ సాగుకు పొగాకు బోర్డు అనుమతి అవసరం లేదు. వర్జీనియా పొగాకు మాదిరిగా క్యూరింగ్ చేయాల్సిన అవసరం లేనందున బ్యారెన్‌తో పనిలేదు. ఆకులు రెలిచి ఎండలో ఆరబెట్టుకుని బేళ్లు కడితే సరిపోతుంది. అలాగే వర్జీనియా పొగాకులా 8,9 సార్లు రెలవాల్సిన పని లేదు. మూడు నాలుగుసార్లు రెలిచి ఆరబెట్టుకునే అవకాశం ఉంది. దీంతో బ్యారెన్ లీజు, క్యూరింగ్ ఖర్చు రూపంలో ఎకరాకు కనీసం రూ.60వేల వరకు పెట్టుబడి తగ్గుతుంది. అలాగే ఎకరాకు 15 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని కంపెనీల ప్రతినిధులు రైతులకు వివరిస్తున్నారు. పొగాకు బోర్డు నిబంధనలతో పనిలేకుండా నేరుగా ఒకేసారి మొత్తం పొగాకుని తాము కొనుగోలు చేస్తామంటూ రైతులను ప్రోత్సహిస్తున్నారు. దీంతో ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని భావిస్తున్న మెట్ట రైతులు బర్లీ పొగాకు సాగుకు ముందుకు వచ్చారు.



సాగు ఇలా..

బర్లీ పొగాకు విత్తనాలను కిలో రూ.వేయి చొప్పున కంపెనీయే అందజేస్తోంది. కిలో విత్తనాలతో సాగు చేసిన నారుమడులు సక్రమంగా పెరిగితే వంద ఎకరాల్లో నాటుకోవచ్చు. ఈ ఏడాది పొగాకు నారు మూట రూ. 3వేల నుంచి రూ. 7 వేల వరకు పలికింది. పొగాకు నారుమడులు సాగు చేసిన రైతులు కూడా లాభాలు ఆర్జించారు. పొగాకు సాగు చేసే రైతులు స్థానికంగా అందుబాటులో ఉన్న నారుమడులతో పాటు ప్రకాశం జిల్లా నుంచి కూడా నారును తీసుకొచ్చి సాగు చేశారు. ఎకరాకు రూ. 60వేల నుంచి రూ.70 వేల వరకు పెట్టుబడులు అయ్యాయి. ఎకరాకు 10 నుంచి 15 క్వింటాల దిగుబడులు వచ్చే అవకాశం ఉంది. పొగాకు అమ్మకాల చింత లేకుండా క్వింటా పొగాకును రూ. 15వేల వరకు కొనుగోలు చేస్తామని ఐటీసీ కంపెనీ హామీ ఇస్తోంది. దీంతో లాభాలు వచ్చే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. రానున్న రోజుల్లో జిల్లాలో బర్లీ పొగాకు సాగు భారీగా పెరిగే అవకాశం ఉందని రైతులు అభిప్రాయపడుతున్నారు.

20 ఎకరాల్లో సాగు చేశా



ఏటా వర్జీనియా పొగాకుతో పాటు ఇతర పంటలను సాగు చేస్తాను. ఈ ఏడాది ప్రత్యామ్నాయ పంటల సాగులో భాగంగా 20 ఎకరాల్లో బర్లీ పొగాకు సాగు చేపట్టా. భూములు సైతం బర్లీ పొగాకు సాగుకు అనుకూలంగా ఉన్నాయి. తోటలు ఏపుగా పెరిగి నాణ్యమైన దిగుబడులు వస్తున్నాయి. పెట్టుబడులు పోను ఆశించిన స్థాయిలో ఆదాయం వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.

–నలదల సుధాకర్‌రావు, కొత్తూరు,కలిగిరి మండలం

సాగు పెరిగే అవకాశం



రానున్న రోజుల్లో జిల్లాలో బర్లీ పొగాకు గణనీయంగా పెరిగే అవకాశాలు ఉన్నాయి. ఇతర పంటలతో పోలిస్తే రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకం తక్కువగానే ఉంది. పొగాకు బోర్డు అనుమతులు, రిజిస్ట్రేషన్లు, కమీషన్లు లేకపోవడంతో ఖర్చులు తగ్గుతాయి. కంపెనీయే బర్లీ పొగాకును క్వింటా రూ. 15వేల వరకు కొనుగోలు చేయడం రైతులకు లాభసాటిగా మారుతుంది.

–ఆవుల రామిరెడ్డి, కలిగిరి

క్లుప్తంగా

గ్రంథాలయం తనిఖీ

సంగం: స్థానిక గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కుమారరాజా గురువారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి గ్రంథాలయంలోని పుస్తకాల వివరాలను గ్రంథాలయాధికారి రవీంద్రరెడ్డిని అడిగి తెలుసుకున్నారు.

రేపటి వరకు దరఖాస్తు గడువు పొడిగింపు

సీతారామపురం: ప్రభుత్వం బీసీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధికి మంజూరు చేసే సబ్సిడీ రుణాలకు దరఖాస్తు గడువును ఈబీసీలకు శనివారం వరకు పొడిగించినట్లు ఎంపీడీఓ భాస్కర్ గురువారం తెలిపారు. మండలంలోని ఈబీసీలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆర్థిక సాయం



ఉదయగిరి: మండలంలోని గండిపాళేనికి చెందిన గోరంట్ల వేణు ఇటీవల మృతి చెందిన నేపథ్యంలో కుటుంబ సభ్యులకు గ్రామానికి చెందిన పలువురు గురువారం ఆర్థిక సాయం అందజేశారు. సేవాగుణ ఫౌండేషన్ సభ్యులు రూ.21వేలు, గ్రామానికి చెందిన రెడ్డిబత్తిన ఉమాసాయిరాం మరో రూ.5 వేలు చొప్పున అందజేశారు. మృతుడి కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవడం తమ దృష్టికి రావడంతో ఆర్థిక సాయం అందజేసినట్లు వారు తెలిపారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు 8 మంది విద్యార్థుల ఎంపిక



సంగం: ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు కేంద్రం అందజేసే నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు సంగం మండలానికి చెందిన 8 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. సంగం జిల్లా పరిషత్ హైస్కూల్ నుంచి ఆరుగురు, తరుణవాయి జెడ్పీ హైస్కూల్ నుంచి ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. సంగం జెడ్పీ హైస్కూల్‌లో ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపికైన విద్యార్థులను హెచ్‌ఎం బుజ్జయ్య, ఉపాధ్యాయులు గురువారం అభినందించారు.

ఓడీఎఫ్ ప్లస్ గ్రామాల పరిశీలన



సీతారామపురం: మండలంలోని దేవమ్మచెరువు, దేవిశెట్టిపల్లి, జయపురం గ్రామాలను ఓడీఎఫ్ ప్లస్ గ్రామాలుగా ఉన్నతాధికారులు ఎంపిక చేసినట్లు ప్రత్యేకాధికారుల బృందం తెలిపింది. గురువారం ఓడీఎఫ్ ప్లస్ గ్రామాల్లో ప్రత్యేక బృందం పర్యటించింది. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు, మరుగుదొడ్ల వినియోగం, పారిశుధ్యం మెరుగునకు తీసుకుంటున్న చర్యలు, తదితరాలను నిశితంగా పరిశీలించింది. బహిరంగ మలవిసర్జనతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రతి ఒక్కరూ మరుగుదొడ్లను వినియోగించాలని సూచించింది. కొండాపురం, మర్రిపాడు, దుత్తలూరు, ఉదయగిరి మండలాల ఎంపీడీఓలు ఆదినారాయణరావు, నాగేశ్వరప్రసాద్, మల్లికార్జున, అప్పాజీతో పాటు ప్రత్యేక అధికారుల బృందం సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలు ప్రారంభం



సోమశిల: అనంతసాగరం మండలం బొమ్మవరం పంచాయతీ పరిధిలోని అగ్రహారంలో నూతనంగా నిర్మించిన రామమందిరంలో విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు గణపతిపూజ, విశేష పూజలు, హోమాలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు. ఈ నెల 15న సీతారామలక్ష్మణ, ఆంజనేయస్వామి విగ్రహాలను ప్రతిష్ఠించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

మర్యాదపూర్వకంగా..

సోమశిల: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని ఆయన నివాసంలో వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ సభ్యులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. జగన్‌ను సత్కరించి ఉపాధ్యాయుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. జగన్‌ను కలిసిన వారిలో అనంతసాగరానికి చెందిన వైఎస్సార్‌టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి మెట్టుకూరు సుబ్బారెడ్డి, మండల కార్యదర్శి నీరుకట్టు శ్రీలత, జిల్లా గౌరవాధ్యక్షుడు సురేష్ ఉన్నారు.

ఆటపాటలతో విద్యను అందించాలి


సంగం: శిక్షణ ఇస్తున్న సీడీపీఓ సునీలత


ఉదయగిరి: వింజమూరులో శిక్షణ ఇస్తున్న ఎంఈఓ

జలదంకి/సంగం/ఉదయగిరి(వింజమూరు): అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు పోషకాహారంతో పాటు ఆటపాటలతో కూడిన నాణ్యమైన విద్యను అందించాలని ఐసీడీఎస్ వింజమూరు ప్రాజెక్ట్ సీడీపీఓ పద్మజాకుమారి సూచించారు. జలదంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషణ్ భీ- పఢాయి భీ కార్యక్రమంపై గురువారం నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో సీడీపీఓ మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేయడంతో పాటు చిన్నారుల మానసిక, శారీరక ఎదుగుదలలో అంగన్‌వాడీ కార్యకర్తలు కీలకపాత్ర పోషించాలన్నారు. గర్భిణులు, బాలింతలపై ప్రత్యేక శ్రద్ధ చూపి వారి ఆరోగ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత అంగన్‌వాడ కార్యకర్తలపై ఉందన్నారు. చిన్నారుల తల్లిదండ్రులు ఆర్థికంగా అభివృద్ధి చెందేలా వారిలో ప్రేరణ కలిగించాలన్నారు. అనంతరం బాల్య విద్య, ఫౌండేషన్ విద్య, చిన్నారులకు ఆటలు, పాటలు నేర్పే విధానాలపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు హైమావతి, రాజేశ్వరి, అరుణ, తదితరులు పాల్గొన్నారు. అలాగే వింజమూరులోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషణ్ భీ- పడాయి భీ కార్యక్రమంపై ఎంఈఓ మధుసూదన్‌రెడ్డి శిక్షణ ఇచ్చారు. ఐసీడీయస్ సూపర్‌వైజర్లు సుజాత, షకీల, తదితరులు పాల్గొన్నారు. అలాగే సంగంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీఓ సునీలత, ఎంఈఓ మల్లయ్య ముఖ్యఅతిథులుగా హాజరై శిక్షణను ప్రారంభించారు. హెచ్‌ఎం బుజ్జయ్య, స్కూల్ కమిటీ చైర్మన్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుకు చర్యలు

సాక్షి ఎఫెక్ట్..

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు డివిజన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో పారిశుధ్యం మెరుగునకు చర్యలు తీసుకుంటామని డీఎల్‌పీఓ షేక్ నయీంతాజ్‌హసన్ పేర్కొన్నారు. ఆత్మకూరు డివిజన్ పరిధిలో పారిశుధ్యం లోపించడంపై 'సాక్షి'లో 'ప్రకటనలు ఘనం..పారిశుధ్య అధ్వానం' శీర్షికన గురువారం ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. ఆత్మకూరు మండలం కరటంపాడు, బోయలచిరివెళ్ల గ్రామాల్లోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో అమలు జరుగుతున్న పారిశుధ్య కార్యక్రమాలు కొంత మేర కుంటుపడిన మాట వాస్తవమేనని, రానున్న రోజుల్లో ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పారిశుధ్య కార్యక్రమాల అమలుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఆయన వెంట ఈఓపీఆర్డీ డేవిడ్, మండల రిసోర్స్ కోఆర్డినేటర్ బ్రహ్మయ్య, సర్పంచ్‌లు బొలిగర్ల వెంకటేశ్వర్లు, రేవతి, తదితరులు ఉన్నారు.


బోయలచిరివెళ్లలో సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ

విద్యార్థుల ఆత్మహత్యలు బాధాకరం

ఆత్మకూరు: అనంతపురం, విశాఖపట్నంలోని నారాయణ విద్యాసంస్థల్లో విద్యార్థుల ఆత్మహత్యలు చేసుకోవడం తీవ్ర బాధాకరమని ఆంధ్ర విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు మహంత్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన ఆత్మకూరులో విలేకరులతో మాట్లాడారు. నారాయణ యాజమాన్యం ర్యాంకుల కోసం విద్యార్థులను ఒత్తిడికి గురి చేస్తుండడంతో వారు తట్టుకోలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. విద్యార్థుల ఆత్మహత్యలపై కూటమి ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం విచారణ జరిపించి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు.

భూఆధార్‌కు రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి


అల్లూరులో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ నాగరాజు

అల్లూరు: రైతులు భూఆధార్‌ను పొందేందుకు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఏడీఏ నాగరాజు సూచించారు. మండల వ్యవసాయశాఖ కార్యాలయంలో భూఆధార్‌పై గురువారం ఆయన అవగాహన కల్పించారు. రైతు రిజిస్ట్రేషన్ పోర్టల్‌లో రైతుల తమ వివరాలను నమోదు చేయించుకుంటే ప్రత్యేక గుర్తింపు సంఖ్యను ఇవ్వడం జరుగుతుందన్నారు. భవిష్యత్తులో ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఇతర వ్యవసాయ సంబంధిత సేవలను పొందేందుకు భూఆధార్ తోడ్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ వెంకటేశ్వర్లు, రైతులు పాల్గొన్నారు.

దుత్తలూరు: మండలంలోని రైతులు భూఆధార్ పొందేందుకు త్వరితగతిన రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఏఓ ఎన్ వెంకటసుబ్బారెడ్డి సూచించారు. దుత్తలూరులో భూఆధార్‌పై రైతులకు అవగాహన కల్పించారు. తొలి విడతగా సొంత పొలాలు కలిగిన పట్టాదారులను రిజిస్ట్రేషన్ చేస్తున్నట్లు తెలిపారు. రైతులు తమ పట్టాదారు పాస్‌పుస్తకం, 1బీ, అడంగల్, ఆధార్ నంబరు, దానికి అనుసంధానమైన ఫోన్ నంబరు, తదితర వివరాలను అందజేసి వ్యవసాయ శాఖ సిబ్బంది వద్ద రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ సుస్మిత, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అవసరమైన సేవలందించాలి

ఉదయగిరి: గ్రామ సచివాలయాల్లో పనిచేసే సిబ్బంది ప్రజలకు అవసరమైన అన్ని సేవలను సత్వరమే అందించాలని జెడ్పీ డిప్యూటీ సీఈఓ జే మోహన్‌రావు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఆయన పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సర్వేలను సమగ్ర సమాచారంతో నూరు శాతం పూర్తిచేయాలన్నారు. వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు సమయపాలన పాటించాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ అప్పాజీ, పంచాయతీ కార్యదర్శులు కరిముల్లా, నాగూర్‌బీ, శేఖర్ పాల్గొన్నారు.

నీటి వనరుల గణనపై శిక్షణ



చేజర్ల: మండల తహసీల్దార్ కార్యాలయంలో నీటి వనరుల గణనపై వీఆర్వోలు, వీఆర్‌ఏలకు మండలాధికారులు గురువారం శిక్షణ ఇచ్చారు. గ్రామాల్లోని చెరువులు, కుంటలు, బోర్లు, బావులకు సంబంధించి వివరాలు సేకరించి జియోట్యాగింగ్ చేయడంపై అవగాహన ఇచ్చారు. తహసీల్దార్ మురళి, డీటీ మస్తానయ్య, ఏఎస్ఓ, ఇరిగేషన్ ఏఈ, తదితరులు పాల్గొన్నారు.

పన్నుల వసూళ్ల లక్ష్యాన్ని సాధించాలి



సంగం: మార్చిలోగా ఇంటి పన్నుల వసూళ్ల లక్ష్యాన్ని నూరుశాతం సాధించాలని ఆత్మకూరు డీఎల్‌పీఓ నయీంతాజ్‌హసన్ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో గురవారం ఆయన సమావేశం నిర్వహించారు. పరిపాలనా అంశాలు, ఇంటి పన్నులు, స్వర్ణ పంచాయతీ, తదితర అంశాలపై సమీక్షించారు. పంచాయతీల ఆదాయాన్ని పెంచేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ నెల 15 నాటికి చెత్త సంపద కేంద్రాలను ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఈఓపీఆర్డీ వరప్రసాద్ పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ సిగ్నల్స్ అందక ఇక్కట్లు



దుత్తలూరు: మండల కేంద్రమైన దుత్తలూరులో బీఎస్ఎన్ఎల్ సిగ్నల్స్ సక్రమంగా అందడం లేదు. ఇక్కడ బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఉంది. అందులో సెల్ టవర్ ఉంది. దాని నిర్వహణను పట్టించుకునే నాథుడే లేకపోవడంతో తరచూ సిగ్నల్స్‌కు అంతరాయం కలుగుతోంది. విద్యుత్ సరఫరా నిలిచిపోయినప్పుడు పూర్తిగా సిగ్నల్స్ ఆగిపోతుండడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలోని సెల్‌టవర్ నిర్వహణనే అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా బీఎస్ఎన్ఎల్ అధికారులు స్పందించి సిగ్నల్స్ సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు.

మామిడిలో యాజమాన్య పద్ధతులు


మామిడి రైతులకు సూచనలు చేస్తున్న ఉద్యానాధికారిణి ఎం సుధామయి

కావలి: మామిడి రైతులు యాజమాన్య పద్ధతులను పాటించడం ద్వారా అధిక దిగుబడులను సాధించవచ్చని కావలి ఉద్యానాధికారిణి ఎం సుధామయి తెలిపారు. దగదర్తి , కావలి మండలాల్లోని మామిడి తోటలను ఆమె సందర్శించి రైతులకు సూచనలు చేశారు. సాధారణంగా మామిడి చెట్లు డిసెంబర్ చివరి వారంలో మొదలు పెట్టి జనవరి చివరి వరకు పూత పూస్తాయని తెలిపారు. ఈ ఏడాది అధిక వర్షాల కారణంగా బెట్ట పరిస్థితులు లేనందున జనవరి రెండో వారం నుంచి పూత పూసాయని వివరించారు. ఇప్పటికే 45 నుంచి 50 శాతం వరకు పూత వచ్చిందన్నారు. పూతలో 99 శాతం వరకు రాలిపోతుందని తెలిపారు. ఒక పూరెమ్మకు రెండు వేల నుంచి మూడు వేల వరకు పూతలు ఉంటే 5 నుంచి 6 పిందెలు మాత్రమే నిలబడుతాయని చెప్పారు. అందులో చివరికి ఒకటి లేదా రెండు మాత్రమే పెద్దవవుతాయని తెలిపారు. పూత, పిందె దశలో సూక్ష్మపోషకాలు అందించాల్సిన అవసరం ఉందన్నారు. బోరాన్, జింక్ లోపంతో పూత, పిందెలు రాలిపోవడం, కాయ ఎదుగుదల లేకపోవడం జరుగుతుందని చెప్పారు. ఈ సమస్యను అధిగమించేందుకు ఐఐహెచ్‌ఆర్ తయారు చేసిన ఆర్క మ్యాంగో స్పెషల్ సూక్ష్మ పోషక మిశ్రమాన్ని లీటర్ నీటికి 5 గ్రాములు లేదా ఫార్ములా 45 గ్రాములు, జింక్ 2 గ్రాములు, బోరాన్ 2 గ్రాములు చొప్పున కలిపి పిచికారీ చేయాలని సూచించారు. పూత దశలో క్రిమిసంహారక మందులు పిచికారీ చేస్తే పరాగ సంపర్కం చేసే ఈగలు, కీటకాలు చనిపోయి దిగుబడులు తగ్గిపోతాయని తెలిపారు. పిందెలు రాలకుండా ఉండాలంటే నీటి యాజమాన్యం కీలకమన్నారు. పిందెలు బఠాణీ గింజ సైజులో ఉన్నపుడు 2 నుంచి 3 తడులు నీటిని ఇవ్వాలని సూచించారు. పిందెలు రాలకుండా ఉండాలంటే ప్లేనోఫిక్ కెమికల్‌ను 4 గ్రాములు చొప్పున 20 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేయాలని చెప్పారు. దీన్ని మోతాదు మించి వాడకూడదని తెలిపారు. బూడిద తెగులు నివారణకు లీటరు నీటికి 1.5 మి.లీ. కంపనియన్ మందును కలిపి పిచికారీ చేయాలని సూచించారు. తేనే మంచు పురుగు నివారణకు ఇమ్రాఫెజీన్ 2 మి.లీ.ను లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. గొంగళి పురుగు నివారణకు ప్రొక్లెం మందును 2.మి.లీ.ను లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. తోటల్లో కలుపు ఎక్కువగా ఉన్నా పురుగు, తెగుళ్ల బెడద ఎక్కువగా ఉంటుందన్నారు. మందులు పిచికారీ చేసేటపుడు కలుపు, చెట్టు మొదళ్ల, పాదుల్లోనూ పిచికారీ చేస్తే సమగ్రం గా నివారించవచ్చని తెలిపారు.

కారు బోల్తా-ఇద్దరికి గాయాలు

మర్రిపాడు: కారు అదుపుతప్పి బోల్తా పడిన ఘటన మండలంలోని నందవరం చర్చి సమీపంలో నెల్లూరు-ముంబయి జాతీయ రహదారిపై గురువారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలు.. కంపసముద్రం నుంచి సంగం వెళ్తున్న కారు నందవరం చర్చి సమీపంలోకి రాగానే రాంగ్‌రూట్‌లో వచ్చిన బైక్‌ను తప్పించబోయి అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారులోని నలుగురి ప్రయాణికుల్లో ఇద్దరు గాయాలపాలయ్యారు. క్షతగాత్రులను టోల్‌ప్లాజా అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు.

మందులు లేకపోవడంపై అసహనం

దుత్తలూరు: దుత్తలూరులో 104 వాహన సేవలను గురువారం అందజేశారు. వైద్యసిబ్బంది బీపీ, షుగర్, తదితర పరీక్షలు చేసి సరిపడా మందులు ఇవ్వకపోవడంతో దీర్ఘకాలిక రోగులు అసహనం వ్యక్తం చేశారు. గతంలో అన్ని రకాల మందులు ఇచ్చేవారని, ప్రస్తుతం చాలావరకు మందులు లేవని చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో మందులు సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

నిరుపయోగంగా జనరేటర్



సీతారామపురం: మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన జనరేటర్ మరమ్మతులకు గురై ముళ్ల పొదల్లో నిరుపయోగంగా పడి ఉంది. విద్యుత్ కోతల సమయంలో రెవెన్యూ కార్యాలయంలో పనులకు అంతరాయం కలగకుండా గతంలో లక్షలాది రూపాయలు వెచ్చించి జనరేటర్‌ను ఏర్పాటుచేశారు. కాలక్రమేణా జనరేటర్ నిర్వహణకు నిధులు లేక దాన్ని పక్కన పడేశారు. ప్రస్తుతం విద్యుత్ సరఫరా లేని సమయంలో కార్యాలయంలోని కంప్యూటర్లు పనిచేయక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

ఉదయగిరి అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే కాకర్ల సురేష్

ఉదయగిరి: ఉదయగిరిని అభివృద్ధి పథంలో నిలిపేందుకు కృషి చేస్తామని, అందుకు అన్ని వర్గాల వారు సహకారాన్ని అందించాలని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అన్నారు. ఉదయగిరిలోని మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కేంద్ర ప్రభుత్వ నిధులు రూ.5 కోట్లతో చేపట్టనున్న అదనపు గదుల నిర్మాణానికి గురువారం ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాసంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించి వింజమూరులో డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటు చేయించినట్లు తెలిపారు. ఉదయగిరి డిగ్రీ కళాశాలకు రూ.5 కోట్ల నిధులు మంజూరు చేయించామని చెప్పారు. త్వరలో 22 మినరల్ వాటర్‌ప్లాంట్లను ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఉదయగిరిని పారిశ్రామికంగానూ అభివృద్ధి చేసేందుకు తనవంతు కృషి చేస్తున్నానని, త్వరలో కొన్ని పరిశ్రమలను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. ఉదయగిరి ట్యాంక్ బండ్‌ను సుందరంగా తీర్చిదిద్దుతామని, అందుకు అవసరమైన అదనపు నిధులు మంజూరు చేయిస్తామని చెప్పారు. ఉదయగిరి దుర్గాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఉదయగిరి తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. రెవెన్యూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించి స్థానిక రాజకీయ నాయకులతో త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేసి వారి ద్వారా పరిష్కరించాలని తహసీల్దార్ సుభద్రకు సూచించారు. మోచి కులానికి చెందిన 30 కుటుంబాలకు 2016 మందు ఎస్సీలుగా కులధ్రువీకరణ పత్రాలు ఇచ్చారని, ఆ తరువాత ఇవ్వకపోవడంతో వారికి సంక్షేమ పథకాలు అందడంలేదనే అంశంపై తహసీల్దార్, ఆత్మకూరు ఆర్డీఓతో చర్చించారు. మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, టీడీపీ నేతలు చెంచలబాబు యాదవ్, మన్నేటి వెంకటరెడ్డి, మెట్టుకూరి చిరంజీవిరెడ్డి, బయ్యన్న, షేక్ రియాజ్, మాలేపాటి చైతన్య, గడ్డం శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.


అదనపు గదుల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే కాకర్ల